క్లుప్తంగా

ప్రజాపాలన విజయోత్సవాలు



ర్యాలీ తీస్తున్న మున్సిపల్ అధికారులు,సిబ్బంది

మెట్‌పల్లి: పట్టణంలో మున్సిపల్ ఆధ్వర్యంలో ప్రజాపాలన విజయోత్సవాలు నిర్వహించారు. దీనిలో భాగంగా బుధవారం మున్సిపల్ కార్మికులు అతి పునరాతమైన కోనేరులోని నీటిని శుద్ధి చేశారు. ఆ తర్వాత కార్యాలయం నుంచి చావిడి వరకు ర్యాలీగా వెళ్లి మానవ హారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు.కార్యక్రమంలో కమిషనర్ మోహన్, మేనేజర్ వెంకటలక్ష్మి, డీఈ నాగేశ్వర్‌రావు, శానిటరీ ఇన్‌చార్జి రత్నాకర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సౌకర్యాలు సద్వినియోగం చేసుకోవాలి



దివ్యాంగులకు బహుమతులు ప్రదానం చేస్తున్న ఎంఈవో

కోరుట్ల: ప్రభుత్వం దివ్యాంగులకు కల్పిస్తున్న సౌకర్యాలు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో గంగుల నరేశం అన్నారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులకు అందించే సౌకర్యాలు, ఉపకరణాలపై విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఫిజియో థెరపి క్యాంపులను వినియోగించుకోవాలని డాక్టర్ శివకుమార్ అన్నారు. అనంతరం ఆటల పోటీల్లో గెలిచిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు. స్పెషల్ టీచర్స్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థినుల భద్రతే ధ్యేయం



మాట్లాడుతున్న ఎస్సై సతీశ్

గొల్లపల్లి: విద్యార్థినుల భద్రతే ధ్యేయమని ఎస్సై సతీశ్ అన్నారు. బుధవారం మండలంలోని చిల్వాకోడూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థినీలకు షీటీం, యాంటి ఉమెన్ ట్రాఫికింగ్ యూనిట్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ విద్యార్థినులు, బాలికలు, మహిళల భద్రత కోసం పోలీసు శాఖ అనేక రక్షణ చర్యలు చేపడుతోందన్నారు. ఎలాంటి ఇబ్బందులు ఉన్నా షీటీం సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పోలీసులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులకు కీలక సమయం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

సారంగాపూర్: విద్యార్థులకు ఇది కీలక సమయమని ప్రిన్సిపాల్ వై. రమేశ్ బాబు అన్నారు. బుధవారం సారంగాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థుల తల్లితండ్రులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పరీక్షలకు ఇంకా 90 రోజులు మాత్రమే ఉందని, తల్లితండ్రులు తమ పిల్లలపై పరీక్షలు పూర్తి అయ్యేవరకు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, కళాశాల నుంచి వచ్చిన తరువాత వారి పిల్లలను చదివించడానికి సమయం కేటాయించాలని కోరారు. ఇప్పటి వరకు విద్యార్థుల ప్రగతిపై వివరించారు. సమావేశంలో అధ్యాపకులు, విద్యార్థుల తల్లితండ్రులు పాల్గొన్నారు.

'సీఎంపై ఎమ్మెల్యే విమర్శలు సరికాదు'

కోరుట్ల: సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తూ ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ సీఎం రేవంత్ రెడ్డిని విమర్శించటం సరికాదని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు జువ్వాడి కృష్ణారావు అన్నారు. పట్టణంలోని జువ్వాడి భవన్‌లో బుధవారం మాట్లాడారు. గత పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.400 కోట్లు సీఎం రిలీఫ్ ఫండ్ విడుదల చేస్తే ఒక్క ఏడాదిలోనే కంగ్రెస్ ప్రభుత్వం రూ.830 కోట్లు విడుదల చేసిందన్నారు. మతిమరుపు ఎమ్మెల్యే మొదట తన మతి మరుపుకు మందులు వాడాలని సూచించారు. సీఎంను విమర్శిస్తే ఊరుకునేది లేదన్నారు.

భూప్రకంపనలు

జిల్లా వ్యాప్తంగా పలుచోట్ల బుధవారం ఉదయం స్వల్పంగా భూమి కంపించింది. అకస్మాత్తుగా వచ్చిన స్వల్ప భూకంపంతో ప్రజలు ఆందోళన చెందారు. కొంతమంది ప్రత్యక్షంగా భూకంపంను చూడగా, మరి కొంత మంది సోషల్ మీడియాలో తెలుసుకున్నారు. కోరుట్లతో పాటు మండలంలో ఉదయం భూమి కంపించినట్లు స్థానికులు తెలిపారు. కొంత మంది భయాందోళనకు గురయ్యారు. రెండు, మూడు సెకన్ల పాటు ఇంట్లోని వస్తువులు కదిలినట్లు స్థానికులు పేర్కొన్నారు. భూకంపంపై పలువురి అభిప్రాయాలు వారి మాటల్లో..

ఆరు సెకన్లు కంపించింది



ఉదయం ఇంటి వద్ద ఉండగా ఇంట్లో ఉన్న వస్తువులు శబ్దం రావడంతో పాటు భూమి కంపించింది. దీంతో అకస్మాత్తుగా ఇంటి నుంచి బయటకువచ్చాం. గ్రామాల్లో చాలా మంది భూకంపం వచ్చిందంటూ ఆందోళన చెందారు. సోషల్ మీడియాలోనూ ప్రచారం చాలా జరిగింది.

– లక్ష్మీనారాయణ, తిప్పన్నపేట

ఆందోళనకు గురయ్యాం

ఉదయం పశువులకు నీరు పెడుతుండగా భూమి కంపించినట్లయింది. దీంతో పశువులు ఆందోళన చెందడంతో తాను కూడా ఏం జరుగుతుందో తెలియక ఆందోళనకు గురయ్యాను. అందరూ భయాందోళనతో ఇంటి నుంచి బయటకు రావడంతో భూకంపం వచ్చిందని నిర్ధారణకు వచ్చాం.

– దుంపల రాజిరెడ్డి, పొరండ్ల

కిచెన్‌తో వస్తువులు కదిలాయి



ఈ రోజు ఉదయం మా ఇంట్లో ఏదో శబ్దం వినిపించింది. రెండు, మూడు సెకన్ల పాటు కిచెన్‌లో వస్తువులు కదిలినట్లు కదిలాయి. భయమేసింది. మా ఇంటి పక్కవాళ్లు కూడా అలానే అన్నారు. భూమి కదిలినట్లనిపించింది. తరువాత స్నేహితుల ద్వారా తెలిసింది. అంతటా ఇలాగే కదిలిందని సోషల్ మీడియాలో ప్రచారమైంది.

– మల్లేశం, యెఖీన్‌పూర్

ప్రకృతి విధ్వంసంతోనే భూకంపాలు



మనిషి తన మనుగడ కోసం,సుఖజీవనం కోసం ప్రకృతిపై విపరీతంగా ఆధారపడి సహజ వనరులను దుర్వినియోగం చేస్తున్నారు. దాని ఫలితంగానే ప్రస్తుతం భూమిపై ప్రకృతి విలయాలు,భూకంపాలు రావడానికి ప్రధాన కారణమవుతోంది.

– శ్రీకాంత్ రేణిగుంట, సివిల్ ఇంజనీర్ ఫ్యాకల్టీ, బుగ్గారం

మూడు సెకన్ల పాటు కంపించింది



సారంగాపూర్: మా గ్రామంలో ఉదయం 7.20–7.25 మధ్య రెండు నుంచి మూడు సెకన్ల పాటు భూమి కంపించింది. నేను స్నానం చేసి పూజ చేసుకోవడానికి సిద్ధపడుతుండగా నా కింద కదులుతున్నట్లు అయ్యింది. బయటకు వచ్చి ఈ విషయంపై నా భార్య స్వాతిని ప్రశ్నించగా భూమి కదలినట్లు అయిందని సమాధానమిచ్చింది.

– వొద్దిపర్తి మధుకుమారాచార్యులు, తుంగూర్, బీర్‌పూర్ మండలం

ఎన్నడు చూడని భూకంపం



మేడిపల్లి: నాకు 42 ఏళ్లు, భూకంపం గురించి వినడమే కానీ ఎప్పుడు చూడలేదు. ఈ రోజు మా గ్రామంలో రెండు సార్లు ప్రకంపనలు రావడంతో ఏం జరుగుతుందో అర్థం కాలేదు. కోతుల బెడదతో బంగుల ఊగింది అనుకున్నాం, సోషల్ మీడియాలో చూసేసరికి అది భూకంపం అని అర్థమైంది.

వన్నెల శివానందం, కమ్మరిపేట

ఆలయాల అభివృద్ధికి పెద్దపీట

- ఎమ్మెల్యే సంజయ్‌కుమార్
- అభివృద్ధి పనులకు శంకుస్థాపన

జగిత్యాలరూరల్: నియోజకవర్గంలో ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. బుధవారం జగిత్యాల రూరల్ మండలం వెల్దుర్తి, గొల్లపల్లె గ్రామాల్లో గట్టు మల్లన్నస్వామి ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ఆలయాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు తీసుకురావడం జరుగుతుందన్నారు. గ్రామంలో ఉన్న పశువుల ఆస్పత్రికి సైతం త్వరలో నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు ప్రవీణ్, ప్రకాశ్, నాయకులు తిరుపతి, శేఖర్, సదాశివరావు, నరేందర్‌రావు, శాంతపురావు, శ్రీకాంత్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి

జగిత్యాల: అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. బుధవారం 32వ వార్డులో రూ.10 లక్షలతో చేపడుతున్న సీసీ, డ్రైయినేజీ పనులకు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో కమిషనర్ చిరంజీవి, ఏఈ అనిల్, ధర్మరాజు, పంబాల రామ్‌కుమార్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కేంద్రంలోని ఉప్పరిపేటలో దాసాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్టాపన చేయగా ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

నియోజకవర్గానికి చెందిన 11 మంది లబ్ధిదారులకు రూ.3.36 లక్షల చెక్కు అందజేశారు.మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి, నాయకులు రాంచందర్ రావు, సురేందర్ పాల్గొన్నారు.

విద్యార్థినికి అభినందన

జగిత్యాలకు చెందిన హేమ, హాసిని వరంగల్‌లో జరిగిన అండర్ –17 బాక్సింగ్ పోటీల్లో బంగారు పతకం సాధించగా, బుధవారం ఎమ్మెల్యే వారిని సత్కరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ రాంమోహన్, కూతురు రాజేశ్ పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

సీఎం కప్ క్రీడలు విజయవంతం చేయాలి

కథలాపూర్: మండలంలోని గ్రామాల్లో ఈ నెల 7 నుంచి నిర్వహించే సీఎం కప్ క్రీడలను విజయవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారి మదన్‌మోహన్ అన్నారు. బుధవారం కథలాపూర్ మండల పరిషత్ కార్యాలయంలో పీఈటీలు, పీడీలు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. దీని కోసం పంచాయతీ కార్యదర్శులు, పీఈటీలు, పీడీలు సమన్వయంతో పనిచేయాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో శంకర్, ఎంపీవో రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

• ఐదురోజుల పాటు సీఎం కప్ క్రీడలు

సారంగాపూర్: ఈ నెల 6 నుంచి ఐదు రోజుల పాటు సీఎం కప్ క్రీడలు నిర్వహించనున్నట్లు బీర్‌పూర్ మండల ప్రత్యేకాధికారి దేవ ప్రసాద్, తహసీల్దార్ ముంతాజుద్దీన్, ఎంపీడీవో లచ్చాలు తెలిపారు. బుధవారం బీర్‌పూర్ మండల పరిషత్ కార్యాలయంలో సీఎం కప్ క్రీడల నిర్వాహణపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మండల స్థాయిలో క్రీడలు నిర్వహించి, మండలస్థాయి క్రీడాకారులను సీఎం కప్‌కు ఎంపిక ఉంటుందని తెలిపారు. సమావేశంలో ఎస్సై కుమారస్వామి, ఎంఈవో నాగభూషణం, హెచ్‌ఎం సత్యరాజ్, ఎస్‌జీఎఫ్ కన్వీనర్, ఫిజికల్ డైరెక్టర్ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

• అటవీ నిప్పు, నివారణపై విద్యార్థులకు అవగాహన

రాయికల్: మండలంలోని చింతలూరు అటవీ క్షేత్రంలో బుధవారం ప్రజా విజయోత్సవాల్లో భాగంగా అటవీశాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు అటవీ నిప్పు, నివారణపై ఎఫ్ఆర్వో భూమేశ్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం అడవులను పరిరక్షించాలని విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో డెప్యూటీ రేంజ్ ఆఫీసర్ పద్మ, సెక్షన్ ఆఫీసర్ మల్లన్న, బీట్ ఆఫీసర్లు రమణారెడ్డి, సంధ్య, ప్రణీత, రత్నాకర్, పాషా పాల్గొన్నారు.

• విద్యార్థులకు అండగా బీఆర్ఎస్

సారంగాపూర్: విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించే వరకు బీఆర్ఎస్ పార్టీ, బీఆర్ఎస్వీ పోరాడుతుందని మాజీ జెడ్పీటీసీ కొల్ముల రమణ, బీఆర్ఎస్వీ జగిత్యాల జిల్లా ఇన్‌చార్జి జక్కుల వెంకటేశ్ అన్నారు. బుధవారం బీర్‌పూర్ మండలం గొండుగూడెం (మంగేళ) గ్రామ గిరిజన ఆశ్రమ పాఠశాల, చిత్రవేణిగూడెం గిరిజన ఆశ్రమ పాఠశాలలను సందర్శించి విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మాజీ వైండో చైర్మన్ మెరుగు రాజేశం, నాయకులు గురునాథం మల్లేశం, పోలాస వినోద్, రస శంకర్, నారపాక సతీష్, తదితరులు పాల్గొన్నారు.

• కేసీఆర్ హయాంలోనే ఆదర్శంగా గురుకుల పాఠశాలలు

గొల్లపల్లి: కేసీఆర్ హయాంలోనే గురుకుల పాఠశాలలు ఆదర్శంగా నిలిచాయని బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి పాదం తిరుపతి అన్నారు. గొల్లపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల హాస్టల్‌ను గురువారం సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. కేసీఆర్ హయాంలో ఆదర్శంగా నిలిచిన గురుకుల విద్యా వ్యవస్థ నేడు కుప్పకూలిందని వాపోయారు. విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్వీ గురుకులాల బాట జిల్లా ఇన్‌చార్జి జక్కుల వెంకటేశ్, జిల్లా అధ్యక్షుడు రామడుగు రాజేష్, నాయకులు అజాం రిషిరెడ్డి పాల్గొన్నారు.

• రూ. 1.94 కోట్లతో మార్కెట్ అభివృద్ధి

కథలాపూర్: వ్యవసాయ మార్కెట్ కార్యాలయం ఆవరణలో రూ.1.94 కోట్లతో అభివృద్ధి పనులు చేయాలని నిర్ణయించినట్లు చైర్మన్ పూండ్ర నారాయణరెడ్డి తెలిపారు. బుధవారం కథలాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యులు మండలంలోని మార్కెటింగ్ నిర్వహణ తీరు, రైతుల సమస్యలపై చర్చించారు. మొదటగా కార్యాలయం ఆవరణలో మట్టితో చదును చేయించాలన్నారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను కలిసి సమస్యలు విన్నవించి మరింత అభివృద్ధి చేస్తామని వారు పేర్కొన్నారు. సమావేశంలో వైస్ చైర్‌పర్సన్ పులి శిరీషా, డైరెక్టర్లు పాల్గొన్నారు.

• ప్రభుత్వ పథకాలపై కళాబృందం ప్రదర్శన

బుగ్గారం: ప్రజాపాలన విజయోత్సవాల్లో ప్రభుత్వ సంక్షేమ పథకాలు, కార్యక్రమాల గురించి తెలంగాణ సాంస్కృతిక సారథి కళాబృందం మండలంలోని వెల్గొండ,గోపులాపూర్,మద్దునూర్ గ్రామాలలో కళాప్రదర్శనలు నిర్వహించింది.కార్యక్రమంలో కళాకారులు పలిగిరి రాజేందర్,మహిపాల్,పంచిరి ప్రవీణ్,భోగె అశోక్, సురేష్‌నాయక్ పంచాయతీ కార్యదర్శులు,అధికారులు పాల్గొన్నారు.

• అంగన్‌వాడీ కేంద్రంలో అన్నప్రాసన

రాయికల్: పట్టణంలోని రెండో అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం చిన్నారులకు అన్నప్రాసన నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు పాల్గొని మాట్లాడుతూ చిన్నారులు, గర్భిణులు, బాలింతలు ప్రతి ఒక్కరు పౌష్టికాహారం తీసుకోవాలని, అప్పుడే ఆరోగ్యంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ వల్లకొండ మహేశ్, శ్రీధర్‌రెడ్డి, సీడీపీవో మమత, అంగన్‌వాడీ టీచర్ రమాదేవి పాల్గొన్నారు.

• నామినేటెడ్ పదవుల్లో యాదవులకు స్థానం కల్పించాలి

సారంగాపూర్: ప్రభుత్వం నియమించే నామినేటెడ్ పోస్టుల్లో యాదవులకు సముచిత స్థానం కల్పించాలని యాదవ సంఘం అడహాక్ కమిటీ జిల్లా అధ్యక్షుడు గనవేని మల్లేష్‌యాదవ్, మాజీ జెడ్పీటీసీ కొల్ముల రమణలు కోరారు. బుధవారం బీర్‌పూర్ మండలం కొల్వాయిలో జరిగిన యాదవ సంఘ సమావేశంలో వారు మాట్లాడారు. జనాభా దామాషా యాదవ సామాజిక వర్గం ఎక్కువగా ఉందని, దీనికి అనుగుణంగా యాదవులకు పదవులు కేటాయించాలని కోరారు. సమావేశంలో నాయకులు చల్ల లక్ష్మణ్ యాదవ్, కొమురెల్లి యాదవ్, నరిగే తిరుపతియాదవ్ పాల్గొన్నారు.

• యువ వికాస్ సభకు తరలిన నాయకులు

జగిత్యాల: పెద్దపల్లిలో జరిగిన ముఖ్యమంత్రి సభకు జగిత్యాల నుంచి నాయకులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ జ్యోతి మాట్లాడుతూ ప్రజాప్రభుత్వంలో రైతులు, యువకులు, ఎస్సీ, ఎస్టీలు, అణగారిన వర్గాలకు మేలు జరిగిందని, ఇది ప్రజా ప్రభుత్వమన్నారు. కార్యక్రమంలో మెప్మా శ్రీనివాస్ పాల్గొన్నారు.

జగిత్యాలరూరల్/ఇబ్రహీంపట్నం/పెగడపల్లి: పెద్దపల్లిలో నిర్వహించిన యువ వికాసం సదస్సుకు జగిత్యాల రూరల్, అర్బన్ మండలాలు, ఇబ్రహీంపట్నం, పెగడపల్లి నుంచి మహిళా సంఘాల సభ్యులు ప్రత్యేక బస్సుల్లో వెళ్లారు.

పోలీస్ హెడ్‌క్వార్టర్‌కు హోంగార్డులు అటాచ్

కొండగట్టు: కొండగట్టు అంజన్న ఆలయంలో విధులు నిర్వర్తించే హోంగార్డులు భక్తుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారని భక్తుల నుంచి ఆరోపణలు వచ్చాయి. ఈ క్రమంలో ఈనెల ఒకటిన 'కొండగట్టులో వసూళ్లపర్వం' శీర్షికన సాక్షి కథనం ప్రచురించింది. స్పందించిన పోలీస్ అధికారులు శ్రీనివాస్, గణేశ్, మహేందర్ అనే ముగ్గురు హోంగార్డులను జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్‌కు అటాచ్ చేసినట్లు తెలిపారు.

బైండోవర్ ఉల్లంఘిస్తే చర్యలు

జగిత్యాలక్రైం: బైండోవర్ ఉల్లంఘించిన వారికి జరిమానా తప్పదని ఎక్సైజ్ సీఐ సర్వేశ్ అన్నారు. కల్లెడ గ్రామానికి చెందిన ఇందునూరి చందు గతంలో నాటుసారా అమ్ముతూ పట్టుబడగా తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. దీంతో చందు బైండోవర్‌ను అతిక్రమిస్తూ మళ్లీ గుడుంబా విక్రయిస్తూ పట్టుబడటంతో అతనిపై కేసు నమోదు చేసి బుధవారం రూరల్ తహసీల్దార్ శ్రీనివాస్ ఎదుట హాజరు చేయగా, బైండోవర్ నిబంధనలు ఉల్లంఘించినందుకు రూ.లక్ష జరిమానా విధించారు. రూ.లక్ష జరిమానా చెక్కును ఎక్సైజ్ సీఐ సర్వేశ్వర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ నాటుసారా విక్రయించినా, తయారుచేసినా కఠిన చర్యలు తప్పవన్నారు.

పీఆర్ ఏఈల బదిలీ

ఇబ్రహీంపట్నం: మండలంలోని పంచాయతీ రాజ్ ఏఈల బదిలీలు చేపట్టారు. మండల ఏఈ అరుణను మెట్‌పల్లి సబ్‌డివిజన్‌కు డిప్యూటేషన్‌పై బదిలీ చేయగా, మల్లాపూర్ మండల ఏఈ అభినవ్‌కుమార్‌ను ఇబ్రహీంపట్నం ఏఈగా డిప్యూటేషన్ పై బదిలీ చేస్తూ పంచాయతీ రాజ్ ఈఈ రెహమాన్ ఉత్తర్వులు జారీ చేశారు.

ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

మెట్‌పల్లి:సీఎం కప్‌లో పాల్గొనే ప్రతి ఒక్కరూ క్రీడాకారుడు ఆన్‌లైన్‌లో తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్తయ్యరెడ్డి తెలిపారు.ఈ నెల 6న సాయంత్రం 5 గంటలకు వరకు మాత్రమే రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం ఉందన్నారు. ఈ విషయాన్ని ఉపాధ్యాయులు విద్యార్థులకు తెలియజేయాలని పేర్కొన్నారు.

నాన్నకు తోడు.. చదువే చేదోడు



సెల్ ఫోన్ వెలుగులో హోమ్ వర్క్ చేస్తున్న చిన్నారి

కోరుట్ల: పట్టణంలో ప్రతీ బుధవారం నిర్వహించే వారసంతలో ఓ చిన్నారి సెల్ ఫోన్ వెలుతురులో హోమ్ వర్క్ చేస్తుండటం అందరినీ ఆకట్టుకుంది. రాజన్న సిరిసిల్ల జిల్లా మల్యాల మండలం నూకపెల్లి గ్రామానికి చెందిన కృష్ణ అనే కూరగాయల వ్యాపారి ప్రతీ బుధవారం కోరుట్లలో నిర్వహించే వారసంతకు వస్తుంటాడు. శ్రీప్రియ స్కూలుకు వెళ్లక పోవటంతో అంగడికి వచ్చింది. తన స్నేహితులతో పాఠాలు సెల్‌ఫోన్‌లో తెలుసుకుని అదే సెల్ ఫోన్ వెలుతురులో హోమ్ వర్క్ పూర్తి చేస్తుండడం అందరిని ఆకట్టుకుంది.



జగిత్యాలటౌన్: పట్టణంలోని ధరూర్ క్యాంపులో నిర్వహిస్తున్న పట్టణ గురుకుల బాలుర పాఠశాలలో స్నానాలు చేయడానికి బాత్‌రూంలు లేకపోవడంతో విద్యార్థులు ఆరుబయట స్నానాలు చేస్తున్నారు. చదువుకునేందుకు తరగతి గదులు లేక అరుగు(నేల)మీదనే తమ చదువులు కొనసాగించాల్సిన దుస్థితి నెలకొంది. కలెక్టరేట్‌కు అతి సమీపంలో ఉండే పట్టణ గురుకుల పాఠశాలలోనే పరిస్థితి ఇలా ఉంటే జిల్లా వ్యాప్తంగా పాఠశాలల్లో వసతుల పరిస్థితి ఏంటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అధికారులు, కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించి కనీస వసతులు కల్పించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
రాము,డీఈవో,జగిత్యాల సెల్ నంబర్: 7995087619

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

పల్లెల అభివృద్ధి కాంగ్రెస్ పార్టీ లక్ష్యం

- చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

కొండగట్టు: రాష్ట్రంలో పల్లెల అభివృద్ధి కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. కొడిమ్యాల మండలంలో పలు అభివృద్ధి పనులకు బుధవారం శంకుస్థాపన చేశారు.నాచుపల్లిలో రూ.47 లక్షలతో నిర్మించే బ్రిడ్జికి,కొండాపూర్ గ్రామంలో రూ.10 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేసి మాట్లాడారు. ప్రభుత్వం పల్లెలకు అధిక నిధులు కేటాయిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్యాక్స్ చైర్మన్ రాజనరసింగరావు, నాయకులు బత్తిని శ్రీనివాస్ గౌడ్, పిడుగు ప్రభాకర్ రెడ్డి, ముత్యం శంకర్,గాజుల అజయ్ పాల్గొన్నారు.



బ్రిడ్జి పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యేసత్యం

యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా వినూత్న రెడ్డి



వినూత్నరెడ్డి

జగిత్యాల: యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ విజయలక్ష్మి కూతురు టి. వినూత్న రెడ్డి ఎన్నికయ్యారు. జిల్లా అధ్యక్షుడిగా బీరం రాజేశ్, అసెంబ్లీ అధ్యక్షుడిగా నల్ల స్వామిరెడ్డి, జగిత్యాల అర్బన్ మండల అధ్యక్షుడిగా తాటిపర్తి పరీక్షిత్‌రెడ్డి, జగిత్యాల రూరల్ మండల అధ్యక్షుడిగా బండారి మధు, సారంగాపూర్ మండల అధ్యక్షుడిగా ఆజాది హరీశ్, బీర్‌పూర్ మండల అధ్యక్షుడిగా కాసారపు అఖిల్, రాయికల్ అధ్యక్షుడిగా ఎలేటి జలేందర్‌రెడ్డి ఎన్నికయ్యారు.

కథలాపూర్ మండలాధ్యక్షుడిగా రాధాకృష్ణ

కథలాపూర్: యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా కలిగోట గ్రామానికి చెందిన అంబటి రాధాకృష్ణ ఎన్నికైనట్లు కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు కాయితి నాగరాజు బుధవారం తెలిపారు. యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్ష పదవికి అధిష్ఠానం ఆన్‌లైన్‌లో ఓటింగ్ నిర్వహించగా... అంబటి రాధాకృష్ణ ఎన్నికైనట్లు ఆయన పేర్కొన్నారు. రాధాకృష్ణను పలువురు అభినందించారు.

మల్యాల అధ్యక్షుడిగా తిరుపతి..

మల్యాల: యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా శనిగరపు తిరుపతి ఎన్నికయ్యారు. మండలాధ్యక్ష పోటీలో ఐదుగురు నిలువగా తిరుపతి అధ్యక్షుడిగా విజయం సాధించాడు. చొప్పదండి అసెంబ్లీ నియోజకవర్గ నియోజకవర్గ ఉపాధ్యక్షుడిగా వెల్మ కృష్ణారెడ్డి విజయం సాధించారు. వీరిని పలువురు అభినందించారు.

• పోలింగ్ బూత్‌ల పరిశీలన

కోరుట్ల రూరల్: మండలంలోని అయిలాపూర్, తిమ్మయ్యపల్లె, చిన్నమెట్‌పల్లి గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో పోలింగ్ బూత్‌లను ఎంపీడీవో రామకృష్ణ బుధవారం పరిశీలించారు. పంచాయతీ ఎన్నికల కోసం ఏర్పాట్లలో భాగంగా పోలీంగ్ బూత్‌లను సిద్ధం చేయనున్నట్లు ఎంపీడీవో తెలిపారు.కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సారంగాపూర్: సర్పంచ్ ఎన్నికల్లో ఓటువేసే పోలింగ్ బూత్‌ల ఏర్పాట్లను అధికారులు బుధవారం పరిశీలించారు. సారంగాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలతో పాటు, ఆయా గ్రామాల్లోని పలు పాఠశాలల్లో పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీ చౌడారపు గంగాధర్, ఎంపీవో శశికుమార్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి ప్రేమలత, పాఠశాలల హెచ్‌ఎంలు ఉన్నారు.

• విద్యార్థులకు ప్రాథమిక అవగాహన సామర్థ్య పరీక్షలు

మల్యాల: జాతీయ అచీవ్‌మెంట్ సర్వేలో భాగంగా బుధవారం మండలంలోని ఐదు పాఠశాలల్లో 3,6,9వ తరగతి విద్యార్థులకు ప్రాథమిక అవగాహన సామర్థ్య పరీక్షలు నిర్వహించారు. మండలంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, మదర్ ఇండియా ప్రాథమిక పాఠశాల మల్యాల జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, నూకపల్లి మోడల్‌స్కూల్‌లో సామర్థ్య పరీక్షలు నిర్వహించారు. నూకపల్లి మోడల్ స్కూల్, ప్రతిభ పాఠశాలను మండల విద్యాధికారి జయసింహారావు సందర్శించి, పరీక్ష తీరును పరిశీలించారు.

• రేపు రాయికల్‌లో ఆరట్టు ఉత్సవం

రాయికల్: పట్టణంలోని అయ్యప్ప ఆలయంలో ఈనెల 6న అయ్యప్ప ఆరట్టు ఉత్సవం నిర్వహిస్తున్నట్లు అర్చకులు మునుగోటి సత్యనారాయణశర్మ బుధవారం తెలిపారు. అయ్యప్ప ఆలయం నుంచి పెద్ద చెరువు వరకు స్వామివారి శోభాయాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

• ఓటర్ల జాబితా సిద్ధం చేస్తున్న కార్యదర్శులు

ఇబ్రహీంపట్నం: రానున్న గ్రామపంచాయతీ ఎన్నికల కోసం పంచాయతీ కార్యదర్శులు సిద్ధం చేస్తున్నారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం పంచాయతీ కార్యదర్శులు ఆయా గ్రామాల ఓటర్ల జాబితాలలోని పోలింగ్ బూత్‌ల వారిగా ప్రతీ పోలింగ్ బూత్‌లో ఎంత మంది ఓటర్లు ఉన్నారు, జాబితాలను తయారు చేసి, ఆన్‌లైన్‌లో నమోదు చేసి, ఈ జాబితాలను జిల్లా కలెక్టర్‌కు పంపించనున్నట్లు ఎంపీడీవో చంద్రశేఖర్ తెలిపారు.

• మధ్యాహ్న భోజన కార్మికులకు అవగాహన

ధర్మపురి: మండల విద్యా వనరుల కేంద్రంలో బుధవారం మండల విద్యాధికారి సీతామహాలక్ష్మి ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన కార్మికులకు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ మధ్యాహ్న భోజనంలో మెను తప్పనిసరిగా పాటించాలని, ముఖాలకు మాస్కులు, చేతులకు గ్లౌజులు ఉపయోగిస్తూ వంట చేయాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వెంకటరమణ, సీఆర్‌పీలు తదితరులున్నారు.

• శాశ్వత అన్నదాన పథకానికి విరాళం

కోరుట్ల: పట్టణంలోని అయ్యప్ప గుట్టపై ఉన్న అయ్యప్ప ఆలయంలో శాశ్వత అన్నదాన పథకానికి మెట్‌పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ క్యాతం వెంకయ్య గురుస్వామి–లక్ష్మి దంపతులు రూ. 15,116 విరాళాన్ని బుధవారం అందజేశారు.

కరపత్రం ఆవిష్కరణ

అయ్యప్ప ఆలయంలో ప్రతీ ఏటా నిర్వహించే సుబ్రహ్మణ్య షష్టి సందర్భంగా నిర్వహించే ఆరట్టు, సుబ్రహ్మణ్య షష్టి కరపత్రాన్ని బుధవారం ఆవిష్కరించారు.